# కులం, మతం కాదు.. గుణం చూసి ఓటేయండి

## మాకన్నింటికీ రామన్నే ఉన్నాడని చెప్పండి

- ఎన్నికల వేళ ఆగంకావద్దు.. ఆలోచించి ఓటేయండి
- రానున్న 30రోజుల్లో సైనికుల్లా పనిచేయండి
- మీ రుణం తీర్చుకునే బాధ్యత మరోసారి ఇవ్వండి
- సిరిసిల్ల పట్టణ యువ ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్



సిరిసిల్లలో నిర్వహించిన యువ ఆత్మీయ సమ్మేళనంలో యువతను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల/సిరిసిల్ల టౌన్ అక్టోబర్ 27: గడిచిన నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల ప్రజలు తన కంటూ గుర్తింపునిచ్చారని, మీ రుణం తీర్చుకునే బాధ్యత తనపై ఉందని సిరిసిల్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాల మంత్రి కేటీఆర్ ఉద్వేగానికి లోనయ్యారు. ఎన్నికల వేళ ఆగం కావొద్దని, కులం, మతం కాకుండా గుణం చూసి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని రాజకీయ పార్టీలు ఏ పని చేయకపోయినా ఉన్నదిలేనట్లు, లేనిది ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ యువతను దారి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అదే సోషల్‌మీడియా వేదికగా యువత వారి అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సిరిసిల్లలోని పద్మనాయక కల్యాణమండపంలో సిరిసిల్ల బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన యువ ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై, దిశానిర్దేశం చేశారు. రానున్న 30రోజుల్లో యువత సైనికుల్లా పనిచేయాలని, రాబోయే ఐదేళ్లు మీకు సేవ చేస్తానని చెప్పారు. 2014కు ముందు సిరిసిల్ల ఎట్లుండే, ఇప్పుడు ఎట్లయిందనే అభివృద్ధిని ఫొటోలతో సహా సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని కోరారు. నాడు ఉరిసిల్లగా మారిన సిరిసిల్లలో వారానికి 8, 9 మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఉన్నాయని కేసీఆర్ నాయకత్వంలో సిరిసిల్లలో నేతన్నల బతుకుచిత్రం మారిందన్నారు. ఇలాంటి అంశాలను ప్రతి ఇంటికీ చేర్చాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. నేను ప్రజలకు పనికి వచ్చే మనిషిని.. సిరిసిల్లకు పని చేసే మనిషిని, ప్రజల దీవెనలతోనే నేను నాయకున్ని అయ్యానని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఇష్టం ఉన్న నాయకులను పక్కాగా గెలిపించుకుంటారన్నారు. ఇంటికి తులం బంగారం ఇచ్చినా.. ఇష్టం లేని నాయకున్ని ఓడిస్తారన్నారు. కలలో కూడా జరుగని అభివృద్ధిని సిరిసిల్లలో చేశామని, జిల్లా కేంద్రం ఏర్పాటుతోపాటు ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దామని వివరించారు. ఇక్కడి కాంగ్రెస్ నేతలు ఇక్కడేం అభివృద్ధి జరగలేదంటున్నారని, మరి రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలు అభివృద్ధి అంతా సిరిసిల్లలోనే జరిగిందంటూ అసూయపడుతున్నారని.. హస్తం నేతలే అవగాహన లేక మాట్లాడుతున్నరని ఎద్దేవా చేశారు. అంతిమంగా తీర్పుఇవ్వాల్సింది సిరిసిల్ల ప్రజలేనని స్పష్టం చేశారు.

### ఏడాది పొడవునా సజీవ జలధార

తొమ్మిదిన్నరేండ్లలో మీ కండ్ల ముందే జరిగిన అభివృద్ధి ఉందని, తంగళ్లపల్లి వాగులో నాడు తుమ్మలు మొలిచి నీరులేక ఎడారిని తలపించేదని, బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి ట్యాంకర్ల ద్వారా నీటితొట్టిలో నీరు నింపి నిమజ్జనం చేసేవారని గుర్తుచేశారు. కానీ, కేసీఆర్ పాలనలో తంగళ్లపల్లి వాగులో 365 రోజులు బ్రహ్మాండంగా ఎన్నటికీ తరగని నీరు కనిపిస్తున్నాయన్నారు. ఎగువమానేరు నుంచి గోదావరిలో కలిసే వరకు వాగు పొడవునా సజీవ జలధార కేసీఆర్ పాలనలో ఆవిష్కృతమైందన్నారు. మానేరును మార్చింది కేసీఆర్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. సాగునీటి రంగంలో విప్లవం, విద్యలో అభివృద్ధి, ఉపాధి కల్పనలో ముందడుగులు వేస్తూ దూసుకెళ్తున్నామని వివరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సిరిసిల్ల బైపాస్ రెండో బైపాస్‌లో ₹450 కోట్లతో వర్క్ టూ ఓనర్ పథకాన్ని 25వేల మందికి ఉపాధి కల్పించేలా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఈ పార్క్‌లో రెండు యూనిట్లు ప్రారంభమయ్యాయన్నారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా 370ఎకరాల్లో మానేరు శివారు ప్రాంతంలో ఆక్వాహబ్ ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గంభీరావుపేట మండలం నర్మాలలో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పి స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామన్నారు.

### ఆలోచించి ఓటు వేయాలి

సంక్షేమం, అభివృద్ధి రెండు కండ్లలాగా సిరిసిల్లలో ముందుకుసాగుతూ అద్భుత పురోగతిలో దూసుకెళ్తున్నామన్నారు. నియోజకవర్గానికి పద్నాలుగున్నర ఏండ్లుగా సేవ చేశానని తెలిపారు. గత నాలుగున్నరేండ్ల నుంచి కులం ఉండదని, మతం ఉండదని, కానీ ఎన్నికలు రాగానే కులం అని ఒకరు, మతం అని ఒకరు బయలుదేరుతారని విమర్శించారు. అదే అభివృద్ధి జరిగినపుడు కులం, మతం ప్రస్తావన ఎందుకు గుర్తుకు రావడంలేదని ప్రశ్నించారు. ఏ కులంలో పుట్టినప్పటికీ అభ్యర్థుల్లో గుణాన్ని ఆలోచించి ఓటేయాలని సూచించారు. ప్రజా సేవలో నేను పనికి వస్తానని.. నా వల్లే మేలు జరుగుతుందని భావిస్తే నాకు ఓటేయండి. నాకంటే బాగా చేస్తారనే నమ్మకం ఉంటే ఓటుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. 2009 ఎన్నికల్లో తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు తెలంగాణ సాధన కోసం కష్టపడతానని చెప్పి, లాఠీ దెబ్బలు తిని జైలుకు వెళ్లానని గుర్తు చేశారు. 2014 ఎన్నికల్లో మళ్లీ గెలిపించిన సిరిసిల్ల ప్రజల ఆశీర్వాదంతో సీఎం కేసీఆర్ దయతో మంత్రిగా అవకాశం వచ్చిందని, మీ అందరూ తలెత్తుకునేలా పనిచేశానని వివరించారు.

### ఎక్కడికెళ్లినా నాది సిరిసిల్ల అని చెప్పుకుంటా..

ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా తనది సిరిసిల్ల అని చెప్పుకుంటానని.. నాకంటూ గుర్తింపు తెచ్చింది సిరిసిల్ల నియోజకవర్గం అని మంత్రి కేటీఆర్ ఉద్ఘాటించారు. నాకు రాజకీయ జన్మనిచ్చింది సిరిసిల్ల అని స్పష్టం చేశారు. ఎన్నికలు రాగానే ప్రతిపక్షాలు ఆగమాగం చేస్తాయని, కులంపేరుతో రాజకీయం చేస్తే కూడు పెట్టదని, మతం పేరుతో మనుగడ ఉండదన్నారు. పద్నాలుగున్నర ఏండ్ల అభివృద్ధి మీ ఎదుట ఉన్నదని, మీ తలరాత మీరే రాసుకునే అవకాశం మీ చేతుల్లో ఉందన్నారు. 18 నుంచి 25 ఏండ్ల మధ్య యువకులు ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని, మీ ఓటుహక్కు నిర్ణాయక శక్తిగా ఎదుగుతుందన్నారు. రాజకీయాల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలాంటి వారో మీరే ఆలోచన చేయాలని హితవు పలికారు. ఆడబిడ్డల పెళ్లి సంబంధాలకు అటేడు ఇటేడు తరాలు చూస్తామని, మంచిచెడ్డలు పరిశీలిస్తామని.. కష్టపడి సొంత రాష్ట్రంగా ఏర్పాటు చేసుకున్న తెలంగాణను ఎవరి చేతుల్లో పెట్టాలో మీరే నిర్ణయించుకోవాలని కోరారు.

### కాంగ్రెస్, బీజేపీ నేతలకు తెలంగాణ ప్రేమ ఉండదు

అన్ని రాష్ట్రాలకు సీఎం ఉంటారని, కానీ, మన రాష్ట్రానికి మాత్రం తెలంగాణను తెచ్చిన కేసీఆరే సీఎం ఉన్నారని మంత్రి చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులకు తెలంగాణపై ప్రేమ ఉండదన్నారు. ఎన్నికల వేళ ఆగంకావద్దని, ఆచితూచి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. సిరిసిల్లలో జరిగిన అభివృద్ధిని రాష్ట్రంలో జరిగిన సంక్షేమ పథకాలను యువత ఫోన్‌లోని మెసేజ్‌ల ద్వారా బంధువులకు అందరికీ పంపాలని కోరారు. ప్రతిపక్షంలో విజన్ ఉన్న నాయకుడు ఎవరూలేరని, అభివృద్ధే కులంగా సంక్షేమమే మతంగా కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. తెలంగాణను కేసీఆర్ ప్రేమించినంతగా ఏ నాయకుడు ప్రేమించలేడన్నారు. సమ్మేళనంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, ఆయా వార్డుల కౌన్సిలర్లు, వార్డు కమిటీ అధ్యక్షులు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు యువత పాల్గొన్నారు.

# ఆర్టీసీ దసరా ఆదాయం ₹22.7 కోట్లు

- ఆదరించినందుకు ప్రయాణికులకు కృతజ్ఞతలు
- కరీంనగర్ రీజినల్ మేనేజర్ సుచరిత

తెలంగాణచౌక్, అక్టోబర్ 27: బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా టీఎస్ ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌కు ₹22.7 కోట్ల ఆదాయం సమకూరింది. రద్దీ దృష్ట్యా రీజియన్ పరిధిలో ఈనెల 12వ తేదీ నుంచి 26 వరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. రీజియన్ పరిధిలోని 11 డిపోల నుంచి హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, మంచిర్యాల, గోదావరిఖని, కోరుట్ల, మెట్‌పల్లి లాంటి పట్టణాలకు అదనంగా బస్సులను నడిపించారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు 1250 ప్రత్యేక బస్సులను నడిపించారు. రీజియన్ పరిధిలోని అన్ని డిపో పరిధిలో బస్సులను 50లక్షల 47వేల కిలోమీటర్లు తిప్పగా ₹22.07 కోట్ల ఆదాయం సమకూరింది. 11 డిపోల నుంచి వచ్చిన ఆదాయం వివరాలిలా ఉన్నాయి. గోదావరిఖని డిపోలో ₹327.49లక్షలు, హుస్నాబాద్‌లో ₹111.96లక్షలు, హుజూరాబాద్‌లో ₹150.25లక్షలు, కరీంనగర్–1డిపోలో ₹301.18లక్షలు, కరీంనగర్–2డిపోలో ₹267.13లక్షలు, మంథని డిపోలో ₹136.28లక్షలు, జగిత్యాల డిపోలో ₹302.56లక్షలు, కోరుట్ల డిపోలో ₹159.76లక్షలు, మెట్‌పల్లి డిపోలో ₹132.84లక్షలు, సిరిసిల్ల డిపోలో ₹150.99లక్షలు, వేములవాడ డిపోలో ₹166.19 లక్షల ఆదాయం వచ్చింది. కాగా ఆర్టీసీని ఆదరించినందుకు కరీంనగర్ రీజినల్ మేనేజర్ సుచరిత ప్రయాణికులకు కృతజ్ఞతలు తెలిపారు.

# రూ. 93. 13 లక్షల నగదు జప్తు..

పెద్దపల్లి, అక్టోబర్27: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఇప్పటి వరకు రూ. 93, 13, 860 నగదు, 42. 082 కిలోల వెండి, 29 యాంప్లీఫైర్లు, 58 డీజే బాక్సులు, 58 గ్రాముల బంగారం జప్తు చేశామని, అందులో రూ. 88, 50, 850 నగదు జిల్లా గ్రీవెన్స్ కమిటీ పరిశీలన అనంతరం విడుదల చేశామని జిల్లా ఎన్నికల అధికారి ముజామ్మిల్‌ఖాన్ తెలిపారు. జప్తు చేసిన నగదు, ఆభరణాలను విడదల, అప్పీల్ చేయడానికి గానూ, ఇతర వివరాలకు సీనియర్ ఇన్స్‌పెక్టర్ పీ సురేందర్ రెడ్డి సెల్ నంబర్ 9182862887లో సంప్రదించాలని సూచించారు. సీజ్ చేయడం జరిగిందని వెల్లడించారు.

# నేడు లక్ష్మీనరసింహస్వామి ఆలయం మూసివేత

- చంద్రగ్రహణం సందర్భంగా దర్శనం నిలిపివేత
- ఆదివారం ఉదయం 9గంటలకు పునఃదర్శనం

ధర్మపురి, అక్టోబర్ 27: చంద్రగ్రహణం సందర్భంగా శనివారం(నేడు) ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని గ్రహణం సమయంలో మూసి వేస్తామని దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. శనివారం రాత్రి 1.05 గంటల నుంచి రాత్రి 2.21 గంటల వరకు గ్రహణం ఏర్పడనున్నందున మధ్యాహ్నం 2 గంటలకే ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలను మూసి వేయనున్నట్లు తెలిపారు. తిరిగి ఆదివారం ఉదయం సంప్రోక్షణ, పుణ్యాహవచనం, గ్రహణ హోమం నిర్వహించిన అనంతరం 9గంటలకు భక్తుల దర్శనానికి అనుమతిస్తామన్నారు. అలాగే శనివారం నిర్వహించే కోజాగిరి పౌర్ణమి వేడుకలను గ్రహణం కారణంగా రద్దు చేశామని భక్తులు గమనించాలని ఈవో కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600. NT-320535

★ ఒక ప్రముఖ సర్వే సంస్థలో తెలంగాణ ఎలక్షన్ క్యాంపెయిన్ & సర్వే చేయుటకు రాజకీయ అవగాహన కలిగిన వెండార్స్ (500+టీం మెంబర్స్) కావలెను. సంప్ర: 7396856819, 7386886819. NT-320424-All

★ ఏరియా వైస్ మార్కెటింగ్ పీపుల్ కావలెను. M/F మీ ఏరియాలో పని చేయడానికి వ్యాపార అవకాశం డిస్ట్రిక్ట్ మండల్ ఏజెంట్స్ కావలెను. డైరెక్ట్ కంపెనీ, P/F టైం. Ph: 9550202447. NT-320317

CHANGE OF NAME

★ I, APPIDI RAVINDER, S/o. Narayana Reddy, R/o. 6-63, Gumlapur, Choppadandi, Karimnagar, TS. Changed My Name as APPIDI RAVINDER REDDY, S/o. Narayana Reddy. NT-320714

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194